ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ

ప్రజలపై అమ్మవారి కరుణ ఉండాలి

- సింహవాహిని మహంకాళికి మంత్రి సురేఖ ప్రత్యేక పూజలు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి

3లో..



సోమవారం 10 ఆగస్టు, 2026 | సంపుటి - 01 సంచిక - 361 | పేజీలు -06 వెల - 5

## ఎస్ఐఆర్‌లో
# హైదరాబాద్ లాస్ట్

కాకతీయ, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈఎఫ్‌ల డిజిటైజేషన్ వేగం జిల్లాల మధ్య భారీ వ్యత్యాసాన్ని చూపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 3,38,26,448 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌ల పంపిణీ 100 శాతం పూర్తయినా.. ఇప్పటివరకు 2,64,30,494 ఈఎఫ్‌లు మాత్రమే డిజిటైజ్ అయ్యాయి. దీంతో రాష్ట్ర సగటు 78.14 శాతానికే పరిమితమైంది. ఇంకా 73,95,954 ఈఎఫ్‌లు డిజిటైజ్ కావాల్సి ఉంది. అత్యధిక ఎలక్టర్లు ఉన్న హైదరాబాద్‌లో పరిస్థితి మరింత వెనుకబడి ఉంది. జిల్లాలో 47,36,669 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌లు పంపిణీ చేయగా.. 27,74,687 మాత్రమే డిజిటైజ్ అయ్యాయి. దీంతో హైదరాబాద్ 58.58 శాతంతో అట్టడుగు స్థానాల్లో నిలిచింది. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరిలో 63.82 శాతం, రంగారెడ్డిలో 64.91 శాతమే నమోదైంది. మరోవైపు యాదాద్రి భువనగిరి 94.30 శాతంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. అంటే ఒకవైపు రాజధాని జిల్లాలో డిజిటైజేషన్ 60 శాతానికి చేరువలోనే ఉండగా.. మరోవైపు యాదాద్రి భువనగిరి 95 శాతానికి చేరువైంది. ఆగస్టు 9న సాయంత్రం 6 గంటల వరకు నమోదైన అధికారిక స్టేటస్ రిపోర్టు ఈ వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తోంది.

### హైదరాబాద్‌లోనే 19.62 లక్షలు పెండింగ్

రాష్ట్ర రాజధానిలో ఎస్ఐఆర్ డిజిటైజేషన్ పురోగతి అత్యల్పంగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లో మొత్తం 47,36,669 మంది ఎలక్టర్లు ఉండగా.. వీరందరికీ ఈఎఫ్‌ల పంపిణీ పూర్తయింది. అయితే ఇప్పటివరకు 27,74,687 ఈఎఫ్‌లు మాత్రమే డిజిటైజ్ అయ్యాయి. దీంతో 19,61,982 ఈఎఫ్‌లు ఇంకా డిజిటైజ్ కావాల్సి ఉంది. అత్యధిక సంఖ్యలో ఎలక్టర్లు ఉన్న జిల్లాల్లో హైదరాబాద్ ఒకటి కావడంతో.. ఇక్కడి పురోగతి రాష్ట్ర మొత్తం డిజిటైజేషన్ శాతంపైనా ప్రభావం చూపుతోంది. హైదరాబాద్ చుట్టూ ఉన్న మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనూ డిజిటైజేషన్ 65 శాతానికి దిగువనే ఉంది. మేడ్చల్–మల్కాజిగిరిలో 29,79,130 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌లు పంపిణీ చేయగా.. 19,01,328 డిజిటైజ్ అయ్యాయి. దీంతో 63.82 శాతం నమోదైంది. ఇంకా 10,77,802 ఈఎఫ్‌లు డిజిటైజ్ కావాల్సి ఉంది. రంగారెడ్డిలో 36,99,743 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌లు పంపిణీ చేయగా.. 24,01,390 డిజిటైజ్ అయ్యాయి. దీంతో 64.91 శాతం పూర్తయింది. మరో 12,98,353 ఈఎఫ్‌ల డిజిటైజేషన్ మిగిలి ఉంది.

### యాదాద్రి భువనగిరి టాప్..

డిజిటైజేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. జిల్లాలో 4,59,943 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌లు పంపిణీ చేయగా.. 4,33,735 డిజిటైజ్ అయ్యాయి. దీంతో 94.30 శాతం పురోగతి నమోదైంది. జనగాం 91.69 శాతంతో రెండో స్థానంలో ఉంది. మెదక్ 90.54, సూర్యాపేట 90.43, ........(తరువాయి 2లో)




- రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతమే డిజిటైజేషన్
- హైదరాబాద్ 58.58 శాతంతో అట్టడుగున
- మేడ్చల్ 63.82.. రంగారెడ్డి 64.91 శాతం
- యాదాద్రి భువనగిరి 94.30 శాతంతో టాప్
- ఇంకా 73.95 లక్షల ఈఎఫ్‌ల డిజిటైజేషన్ పెండింగ్

## పెద్ది కుటుంబానికి
# కేసీఆర్ భరోసా

- కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ
- పిల్లలకు చెరో రూ.కోటి.. అమృతమ్మకు రూ.25 లక్షల సాయం
- కేసీఆర్ రాకతో భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- 11 ఏళ్ల తర్వాత నల్లబెల్లికి మాజీ సీఎం
- బందోబస్తు వైఫల్యం.. అరగంట కాన్వాయ్‌లోనే కేసీఆర్



కాకతీయ, నల్లబెల్లి : దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు పార్టీ తరఫున చెరో రూ.కోటి చొప్పున, వారి తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. సుమారు 11 ఏళ్ల తర్వాత కేసీఆర్ నల్లబెల్లి గడ్డపైకి రావడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రహదారుల వెంట భారీగా జనం నిలవడంతో నల్లబెల్లిలో సందడి నెలకొంది. అయితే కేసీఆర్ కాన్వాయ్ వద్దకు ఒక్కసారిగా కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో సుమారు 30 నిమిషాలపాటు కేసీఆర్ కాన్వాయ్‌లోనే ఉండాల్సి వచ్చింది. నల్లబెల్లికి చేరుకున్న కేసీఆర్ ముందుగా పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ........(తరువాయి 2లో)

## కేంద్రం నిధులతోనే
# కరీంనగర్ అభివృద్ధి

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా తేలేదు
- కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలి
- కేంద్ర పథకాలతోనే కీలక అభివృద్ధి పనులు
- కరీంనగర్‌కు ప్రత్యేకంగా రూ.1,000 కోట్ల ప్యాకేజీ తేవాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

6లో..

# బిల్లు..! ఘోల్లు..!!

- ఆర్థిక శాఖలో 'పర్సంటేజీ' పర్వం?
- బిల్లులు పాస్ కావాలంటే 'రేటు' చెల్లించాల్సిందేనా?
- 5 శాతం.. 8 శాతం.. 10 శాతం.. బిల్లుల చెల్లింపులపై ఆరోపణలు
- విడుదలకు.. చెల్లింపులకు మధ్య అసలు లెక్కేంటి?
- బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కాంట్రాక్టర్లు




**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో బిల్లుల చెల్లింపులపై కాంట్రాక్టర్లలో అసంతృప్తి పెరుగుతున్నదా? ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తున్నా.. పనులు పూర్తిచేసిన వారికి బిల్లులు ఎందుకు అందడం లేదు? బిల్లులు పాస్ కావడానికి సాధారణ పరిపాలనా ప్రక్రియకు మించి 'పర్సంటేజీ' వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలకు కారణమేంటి? 5 శాతం, 8 శాతం, 10 శాతం అంటూ బిల్లుల పరిమాణాన్ని బట్టి 'రేట్లు' మారుతున్నాయన్న ప్రచారం ఇప్పుడు ఆర్థిక శాఖ బిల్లుల చెల్లింపు వ్యవస్థపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ప్రభుత్వం కోట్లలో నిధులు విడుదల చేసినట్లు చెబుతున్నా.. మరోవైపు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంపై అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తుతుండటం గమనార్హం. వాస్తవంగా ఎంత మొత్తం విడుదలైంది? ఎంత మొత్తం బిల్లులకు చెల్లించారు? ఇంకా ఎంత బకాయి ఉంది? అన్న లెక్కలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో మెడికల్ అండ్ హెల్త్ శాఖలో పనిచేసి రిటైర్ అయిన ఓ ఉద్యోగి తనకు రావాల్సిన సుమారు రూ.40 లక్షల బకాయిపై మంత్రి సతీమణి 10 శాతం కమీషన్ డిమాండ్ చేశారంటూ చేసిన ఆరోపణలు ఇప్పుడు సంచలనంగా మారుతున్నాయి. బిల్లుల చెల్లింపులపై వినిపిస్తున్న వాదనలకు ఒక ఉదాహరణగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటిస్తున్న నిధుల విడుదలకు, వాస్తవ చెల్లింపులకు మధ్య ఉన్న .......(తరువాయి 2లో)

# పరకాల కాంగ్రెస్‌లో సవ్యంగానే ఉందా..?



- కీలక క్యాడర్ ఎందుకు సైలెంట్ మరి ?
- నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై చర్చ
- క్యాడర్‌ను ఏకతాటిపైకి తేవడంలో ఎమ్మెల్యేకు సవాల్
- సీఎం సభ కోసం సమన్వయ కమిటీతో ప్రత్యేక సమావేశం
- బూత్ స్థాయి నుంచి సైనికుల్లా పనిచేయాలని పిలుపు

4లో..

## మాజీ ఎమ్మెల్యే గొర్రె సిద్దయ్య కన్నుమూత

6లో..

- 1978లో 7,056 ఓట్ల మెజారిటీతో ఘన విజయం
- 95 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లో తుదిశ్వాస



# పెద్ది విగ్రహ గద్దె కూల్చివేత

- నర్సంపేటలో హైటెన్షన్
- అనుమతి లేదంటూ.. రాత్రివేళ మున్సిపల్ సిబ్బంది చర్య
- మెడికల్ కాలేజీ ఎదుట నిర్మించిన గద్దె తొలగింపు
- కక్ష సాధింపులో భాగమేనంటూ బీఆర్ఎస్ ఆరోపణలు

2లో..



# పోలీసుల త్యాగాలతోనే నేడు శాంతి

- నక్సలిజంపై పోరులో నేలకొరిగిన అనేక మంది పోలీసులు
- వరంగల్‌లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన.. 28 మంది అమరవీరుల కుటుంబాలతో భేటీ
- సమస్యల పరిష్కారానికి టీజీ–వీఈఈఆర్ ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్ ప్రారంభం
- ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, ఇంటి స్థలాలు, పెన్షన్ సమస్యలపై ఆరా
- క్యూఆర్ కోడ్ కుటుంబ కార్డులు.. యూనిట్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు పర్యవేక్షణ



కాకతీయ, వరంగల్ బ్యూరో : నక్సలిజంపై పోరాటంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలే నేడు వరంగల్ ప్రాంతంలో నెలకొన్న ప్రశాంత వాతావరణానికి, శాంతిభద్రతలకు ప్రధాన పునాది అని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించిన అమరవీరుల కుటుంబాల సమస్యలను కూడా అదే బాధ్యతతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నక్సలిజంపై పోరాటంలో అమరులైన 28 మంది పోలీసు కుటుంబాలతో ఆయన సమావేశమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, కారుణ్య నియామకాలు, ఇంటి స్థలాలు, స్థలాల రిజిస్ట్రేషన్, టైటిల్ సమస్యలు, పెన్షన్ తదితర అంశాలపై కుటుంబ సభ్యులు డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేసేందుకు టీజీ–వీఈఈఆర్ ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను ఈ సందర్భంగా ప్రారంభించారు.

### కుటుంబాల సమస్యలకు ప్రత్యేక వ్యవస్థ

అమరవీరుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒకే వేదికపై నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా టీజీ–వీఈఈఆర్ పోర్టల్‌ను రూపొందించారు.ఆర్థిక సాయం, ఎక్స్‌గ్రేషియా, కారుణ్య నియామకాలు, ఇంటి స్థలాల కేటాయింపు, ........తరువాయి 2లో

# ఇంటింటా త్రివర్ణం ఎగరాలి

- హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని మోదీ పిలుపు
- వందేమాతరం 150 ఏళ్ల సందర్భంగా ప్రత్యేకంగా ఈసారి వేడుకలు
- ఆగస్టు 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు, ర్యాలీలు



కాకతీయ, నేషనల్ బ్యూరో: భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో దేశ ప్రజలంతా హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని, వికసిత్ భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక మాత్రమే కాదని, దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అందించే శక్తి అని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఆదివారం ప్రధాని ఈ సందేశాన్ని వెల్లడించారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ప్రచారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని తెలిపారు. జాతీయ గేయం వందేమాతరం రూపకల్పన జరిగి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ఏడాది వేడుకలను ........తరువాయి 2లో

## ఖమ్మం కాంగ్రెస్‌లో
# క'లహం'

- డీసీసీ అధ్యక్షుడి సమక్షంలోనే ఇరువర్గాల ఘర్షణ
- పార్టీ కార్యాలయంలో ఉద్రిక్తత.. మాజీ ఎంపీటీసీపై దాడి ఆరోపణ
- చేరికలతో పెరిగిన పాత, కొత్త నేతల ఆధిపత్య పోరు

5లో..

ఉత్తరం కాకతీయ

సోమవారం 10 ఆగస్ట్, 2026



# పెద్ది కుటుంబానికి కేసీఆర్ భరోసా









(మొదటి పేజీ తరువాయి)

యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పెద్ది కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలిచే చర్యల్లో భాగంగా ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున చెక్కులను అందించారు. అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షల చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో వారిభవిష్యత్ గురించి కూడా భరోసా కల్పించారు.

### 11 ఏళ్ల తర్వాత నల్లబెల్లికి

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు కేసీఆర్ సుమారు 11 ఏళ్ల తర్వాత నల్లబెల్లికి రావడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ప్రత్యేక ఆసక్తి కలిగించింది. ఆయన పర్యటనకు ముందుగానే నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. రహదారుల వెంట కేసీఆర్ రాక కోసం ఎదురుచూశారు. కేసీఆర్ కాన్వాయ్ నల్లబెల్లికి చేరుకోగానే కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికేందుకు ముందుకొచ్చారు. సాయంత్రం సుమారు 3.30 గంటల సమయంలో కేసీఆర్ కాన్వాయ్ నల్లబెల్లికి చేరుకుంది. అప్పటికే పెద్ద సంఖ్యలో వేచి ఉన్న కార్యకర్తలు ఒక్కసారిగా కాన్వాయ్ వైపు కదిలారు. దీంతో కేసీఆర్ వాహనం చుట్టూ జనం గుమిగూడారు. వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. కార్యకర్తలను నియంత్రించేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి కొంతసేపు అదుపులోకి రాలేదు. ఫలితంగా కేసీఆర్ సుమారు 30 నిమిషాల పాటు కాన్వాయ్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. బీఆర్‌ఎస్ అధినేతను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావచ్చని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ.. అందుకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

### కేసీఆర్‌ను చూసేందుకు వచ్చి..

ఉదయం నుంచే కేసీఆర్ కోసం వేచి ఉన్న కార్యకర్తలు, అభిమానులు ఆయనను దగ్గరగా చూసేందుకు ప్రయత్నించారు. అయితే కాన్వాయ్ చుట్టూ భారీగా జనం చేరడంతో పలువురికి ఆ అవకాశం లేకుండా పోయింది. కొందరు వినతిపత్రాలు అందించేందుకు ప్రయత్నించగా.. మరికొందరు కాన్వాయ్‌పై గులాబీ కండువాలు వేసేందుకు ప్రయత్నించారు. కాన్వాయ్ వద్దకు ఓ వాహనం అడ్డంగా రావడంతో పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. తోపులాటల మధ్య పోలీసులు కార్యకర్తలను వెనక్కి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో కేసీఆర్‌ను చూసేందుకు వచ్చిన కొంతమంది ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. పెద్ది కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం కేసీఆర్ తిరుగు ప్రయాణంలోనూ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో కాన్వాయ్ వెంట కదిలారు. ఈ సమయంలో కౌశిక్‌రెడ్డి మాజీ సీఎం కాన్వాయ్ ముందు నడుస్తూ ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి దయాకర్ రావు, వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాలోత్ కవిత, సత్యవతి రాథోడ్, సంతోష్‌రావు, జీవన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగుర్ల వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల త్యాగాలతోనే నేడు శాంతి

(మొదటి పేజీ తరువాయి)

స్థలాల రిజిస్ట్రేషన్, టైటిల్ సమస్యలు, పెన్షన్, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫిర్యాదులను ఇందులో నమోదు చేసుకోవచ్చు. అమరవీరుడి ఉద్యోగ వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, ఇప్పటివరకు అందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు తదితర సమాచారాన్ని కూడా పోర్టల్‌లో సమగ్రంగా పొందుపరచనున్నారు. యూనిట్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్నతాధికారులు ఫిర్యాదులను పర్యవేక్షించేలా వ్యవస్థను రూపొందించారు.

### క్యూఆర్ కోడ్‌తో కుటుంబ కార్డులు

డీజీపీ సీవీ ఆనంద్ అమరవీరుల కుటుంబ సభ్యులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన కుటుంబ కార్డులను అందజేశారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా టీజీ–వీఈఈఆర్ పోర్టల్‌లోకి వెళ్లి సమస్యలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. పోర్టల్ నిర్వహణ, పనితీరుపై ఎస్ఐబీ అధికారులకు డీజీపీ పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల పరిధిలోని అమరవీరుల కుటుంబాలను గుర్తించి, వారి సమస్యలు, ఫిర్యాదులను సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు.

### పెండింగ్ సమస్యలపై డీజీపీ ఆరా

సమావేశంలో అమరవీరుల కుటుంబ సభ్యులు తమకు చాలాకాలంగా పరిష్కారం కాని సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, స్థలాల రిజిస్ట్రేషన్, టైటిల్ సమస్యలు, పెన్షన్ తదితర అంశాలను వివరించారు. కుటుంబ సభ్యులు వెల్లడించిన సమస్యలను డీజీపీ సావధానంగా విన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వారి సమస్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతను ఆదేశించారు.

### నాటి పోరాటాన్ని గుర్తుచేసుకున్న ఆనంద్

తన వృత్తి జీవిత ప్రారంభ దశలో నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో వరంగల్‌లో విధులు నిర్వహించిన విషయాన్ని డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేసుకున్నారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు ఎదుర్కొన్న ఎదురుకాల్పులు, దాడులు, ఆకస్మిక దాడులు వంటి క్లిష్ట పరిస్థితులను ప్రస్తావించారు. విధి నిర్వహణకు ప్రాణాల కంటే ప్రాధాన్యమిచ్చి అమరులైన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని తెలిపారు. నాటి పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన పోలీసుల కుటుంబాలను ఆదుకోవడం పోలీసు శాఖ బాధ్యతగా పేర్కొన్నారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని స్పష్టం చేశారు.

### కొత్త కమిషనరేట్ భవనంపై పరిశీలన

అనంతరం నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన భవనాన్ని డీజీపీ పరిశీలించారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న నేపథ్యంలో పనుల పురోగతిని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత వివరించారు. కొత్త కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందేలా భవనం రూపకల్పన ఉండాలని డీజీపీ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన నిఘా వ్యవస్థ, అంతర్గత పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణంలోని ఉపయోగంలో లేని, శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను తొలగించాలని, అంతర్గత రహదారులను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఎస్పీ సింధు శర్మ, అడిషనల్ కలెక్టర్ రవి, అడిషనల్ ఎస్పీలు వినోద్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది విగ్రహ గద్దె కూల్చివేత!..

# నర్సంపేటలో హైటెన్షన్

- అనుమతి లేదంటూ.. మెడికల్ కాలేజీ ఎదుట నిర్మించిన గద్దె తొలగింపు
- రాత్రివేళ మున్సిపల్ సిబ్బంది చర్య.. అక్కడికి చేరుకున్న బీఆర్‌ఎస్ నేతలు
- కక్ష సాధింపులో భాగమేనంటూ బీఆర్‌ఎస్ ఆరోపణలు



కాకతీయ, నర్సంపేట : దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను నర్సంపేట మున్సిపాలిటీ అధికారులు ఆదివారం రాత్రి కూల్చివేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గద్దె నిర్మించినప్పటికీ, సంబంధిత అనుమతులు లేవంటూ అధికారులు తొలగించినట్లు సమాచారం. రాత్రి వేళ గద్దెను కూల్చివేయడంతో విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రైవేట్ స్థలంలో గద్దె నిర్మిస్తే దానిని అధికారులు రాత్రివేళ తొలగించడంపై బీఆర్‌ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే గద్దెను కూల్చివేశారని ఆరోపించారు. ఈ ఘటనతో నర్సంపేటలో రాజకీయంగా చర్చ మొదలైంది. గద్దె నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? లేవా? మున్సిపాలిటీ అధికారులు ఏ నిబంధనల ఆధారంగా చర్యలు తీసుకున్నారు? అనే అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అధికారులు నిబంధనల ప్రకారమే కూల్చివేత చేపట్టారా? లేక రాజకీయ కక్షతోనే చర్యలకు దిగారా? అనే చర్చ స్థానికంగా సాగుతోంది.

## ఇంటింటా త్రివర్ణం ఎగరాలి

(మొదటి పేజీ తరువాయి)

### వందేమాతరానికి అంకితం చేయడం గర్వకారణమన్నారు.

### 9 నుంచి 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 2022లో ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా ప్రచారం కోట్లాది మంది స్వచ్ఛందంగా పాల్గొనే జాతీయ సంప్రదాయంగా మారింది. త్రివర్ణ పతాకంతో ప్రజల వ్యక్తిగత అనుబంధాన్ని పెంచడం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేయడం, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం దీని ప్రధాన ఉద్దేశాలు. ఈసారి ఆగస్టు 6న ప్రచారం ప్రారంభించగా, ఆగస్టు 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరంగా యాత్రలు, బైక్, సైకిల్ ర్యాలీలు, తిరంగా కచేరీలు, రంగోలి పోటీలు, ప్రత్యేక అలంకరణలు, లైటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి సెల్ఫీ తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు కోరారు.

### దేశవ్యాప్తంగా జోరుగా యాత్రలు

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఇప్పటికే దేశవ్యాప్తంగా ఊపందుకుంది. పుదుచ్చేరిలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిరంగా యాత్రలో పాల్గొన్నారు. అండమాన్‌లోని శ్రీ విజయపురంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆగస్టు క్రాంతి దివస్ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపు తెచ్చిందని గుర్తుచేశారు. ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, మణిపూర్, సిక్కిం తదితర ప్రాంతాల్లోనూ తిరంగా యాత్రలు నిర్వహించారు. విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యత, దేశభక్తి సందేశాన్ని విస్తృతంగా చాటుతోంది.

# బిల్లు..! ఘోల్లు..!!

(మొదటి పేజీ తరువాయి)

అంతరంపై అధికారిక లెక్కలు బయటపెట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

### విడుదలవుతున్న నిధులు.. ఆగుతున్న బిల్లులు?

బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం నిధులు కేటాయించడం, శాఖలు వాటిని వినియోగించడం సాధారణ ప్రక్రియ. అయితే ప్రస్తుత పరిస్థితిపై పలువురు కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పనులు పూర్తిచేసి బిల్లులు సమర్పించినా చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని వాపోతున్నారు. ఒకవైపు నిధులు విడుదలవుతున్నాయని అధికారులు చెబుతుండగా.. మరోవైపు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని అంటున్నారు. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. నిధుల కొరతే బిల్లుల పెండింగ్‌కు కారణమైతే.. విడుదలైనట్లు చెబుతున్న కోట్ల రూపాయలు ఎక్కడికి వెళ్తున్నాయి? నిధులు అందుబాటులో ఉండి కూడా బిల్లులు పెండింగ్‌లో ఉంటే.. వాటిని ఏ దశలో నిలిపివేస్తున్నారు? బిల్లుల చెల్లింపులకు నెలనెలా వందల కోట్లల్లో నిధులు విడుదల చేసినట్లు అధికారుల నుంచి సమాచారం వస్తోందని కాంట్రాక్టర్లు, ఉద్యోగ వర్గాలు చెబుతున్నారు. భారీ మొత్తాల విడుదలకు సంబంధించి శాఖల వారీగా ఎంత? ఏ పనులకు? ఎన్ని బిల్లులకు? ఎంత చెల్లించారు? అన్న సమగ్ర వివరాలు అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఒక దశ అయితే.. ఆ నిధులు బిల్లుల రూపంలో సంబంధిత వ్యక్తులు, సంస్థల ఖాతాలకు చేరడం మరో దశ. ఈ రెండింటి మధ్య ఎంత వ్యవధి ఉంటోంది? ఎక్కడ ఆలస్యం జరుగుతోంది? అన్నది స్పష్టమైతేనే వ్యవహారంపై పూర్తి అవగాహన వస్తుంది.

### 'పర్సంటేజీ' ఆరోపణలకు ఆ రిటైర్డ్ ఉద్యోగి ఉదాహరణ

ఇదే సమయంలో మెడికల్ అండ్ హెల్త్ శాఖలో పనిచేసి రిటైర్ అయిన ఓ ఉద్యోగిని చేసిన ఆరోపణలు ప్రస్తావనకు వస్తున్నాయి. తనకు సుమారు రూ.40 లక్షల బకాయి రావాల్సి ఉందని.. ఆ బిల్లు పాస్ చేయడానికి 10 శాతం కమీషన్ అడుగుతున్నారని ఆమె ఆరోపించారు. తాను నేరుగా మంత్రి భార్య వద్దకు వెళ్లినా పరిస్థితి మారలేదని పేర్కొన్నారు. అంతేకాదు.. 5 శాతం, 8 శాతం, 10 శాతం ఇచ్చిన వారికి బిల్లులు పాస్ అవుతున్నాయని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం రూ.150 కోట్లు, రూ.200 కోట్లు, రూ.700 కోట్లు విడుదల చేస్తున్నట్లు చెబుతున్నా.. వాస్తవంగా బిల్లులు అందడం లేదని కూడా పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులపై బయటకు వస్తున్న అసంతృప్తికి ఈ ఆరోపణ ఒక ఉదాహరణగా మారింది. తనకు రావాల్సిన బకాయిల చెల్లింపుపై కోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయని ఆ రిటైర్డ్ ఉద్యోగి పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల అనంతరం బిల్లు ఏ దశలో ఉంది? చెల్లింపు ఎందుకు జరగలేదు? అన్నది సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది సంబంధిత శాఖ విచారణలో తేలాల్సి ఉంది. కోర్టు ఆదేశాలను పక్కన పెడితే.. సాధారణంగా బిల్లులు పాస్ కావడానికి అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయిన తర్వాత చెల్లింపులు జరగాలి. ఏదైనా అభ్యంతరం ఉంటే దాన్ని బిల్లుదారుడికి తెలియజేయాలి. కానీ బిల్లు ఎందుకు ఆగిందో తెలియకుండా నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉంటే.. అక్కడే వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతాయి.

### బయటకు రావాల్సిన బిల్లుల 'లెక్క'

ఈ వ్యవహారానికి శాశ్వత పరిష్కారం ఆరోపణలు, ఖండనలతో రాదు. లెక్కలు బయటపెట్టడం ద్వారా మాత్రమే వస్తుంది. గత ఏడాది నుంచి ఇప్పటివరకు బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం ఎంత నిధులు విడుదల చేసింది? ఆర్థిక శాఖ నుంచి ఎన్ని విడుదల ఉత్తర్వులు వెలువడ్డాయి? శాఖల వారీగా ఎంత మొత్తం కేటాయించారు? ఎంత మేరకు బిల్లులు పాస్ చేశారు? ఎంత మొత్తం చెల్లించారు? ఇంకా ఎంత పెండింగ్‌లో ఉంది? అన్న వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో బిల్లుల చెల్లింపుల్లో కమీషన్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపై కూడా ఉన్నతస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయి. బిల్లుల చెల్లింపుల్లో నిజంగానే అనధికారిక 'రేట్లు' ఉన్నాయా? లేక నిధుల విడుదల, పరిపాలనా ప్రక్రియలో జాప్యాన్నే కమీషన్ వ్యవహారంగా ప్రచారం చేస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి రూపాయికి లెక్క ఉండాలి. ఆ రూపాయి ఎవరి బిల్లుకు వెళ్లిందో కూడా స్పష్టంగా ఉండాలి.

## ఎస్ఐఆర్‌లో

# హైదరాబాద్ లాస్ట్

(మొదటి పేజీ తరువాయి)

మహబూబాబాద్ 90.07 శాతంతో 90 శాతానికి పైగా డిజిటైజేషన్ పూర్తి చేసిన జిల్లాలుగా ఉన్నాయి. ఇక జగిత్యాల 89.60, పెద్దపల్లి 88.59, ములుగు 88.33, రాజన్న సిరిసిల్ల 87.62 శాతంతో కొనసాగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోనూ పురోగతిలో వ్యత్యాసం కనిపిస్తోంది. వరంగల్‌లో 7,76,953 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌లు పంపిణీ చేయగా.. 6,77,333 డిజిటైజ్ అయ్యాయి. దీంతో 87.18 శాతం నమోదైంది. హనుమకొండలో 5,09,014 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌లు పంపిణీ చేయగా.. 4,06,136 డిజిటైజ్ అయ్యాయి. దీంతో 79.79 శాతం పురోగతి నమోదైంది. ములుగులో 2,36,970 మంది ఎలక్టర్లకు ఈఎఫ్‌ల పంపిణీ పూర్తికాగా.. 2,09,305 డిజిటైజ్ అయ్యాయి. దీంతో అక్కడ 88.33 శాతం నమోదైంది.

### 74 లక్షలకు చేరువలో పెండింగ్

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్‌లో ఈఎఫ్‌ల పంపిణీ 100 శాతం పూర్తయినా.. డిజిటైజేషన్ మాత్రం 78.14 శాతానికే చేరింది. మొత్తం 73,95,954 ఈఎఫ్‌లు ఇంకా డిజిటైజ్ కావాల్సి ఉంది. అంటే పంపిణీ చేసిన ఈఎఫ్‌లలో మరో 21.86 శాతం డిజిటైజేషన్ ప్రక్రియ మిగిలి ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే మిగిలిన ఈఎఫ్‌ల సంఖ్య భారీగా ఉంది. ఈ మూడు జిల్లాల్లో కలిపి 43.38 లక్షలకుపైగా ఈఎఫ్‌లు ఇంకా డిజిటైజ్ కావాల్సి ఉంది. హైదరాబాద్‌లో 19.61 లక్షలు, మేడ్చల్–మల్కాజిగిరిలో 10.77 లక్షలు, రంగారెడ్డిలో 12.98 లక్షల ఈఎఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవైపు ఈఎఫ్‌ల పంపిణీ 100 శాతం పూర్తయిందని అధికారిక గణాంకాలు చెబుతుండగా.. మరోవైపు వాటి డిజిటైజేషన్ ఇంకా 78.14 శాతానికే పరిమితం కావడం ఎస్ఐఆర్ ప్రక్రియలో తదుపరి దశపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా అధిక సంఖ్యలో ఎలక్టర్లు ఉన్న హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో డిజిటైజేషన్ వేగం పెరిగితేనే రాష్ట్ర సగటు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది.

ఉత్తరం కాకతీయ

సోమవారం 10 ఆగస్ట్ 2026



# పోలీసింగ్‌కు కొత్త సవాళ్లు..!






- నక్సలిజం నుంచి సైబర్ నేరాల వరకు భారీ మార్పు
- మౌలిక పోలీసింగ్‌ను విస్మరించొద్దు..
- క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి
- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : డీజీపీ సీవీ ఆనంద్

కాకతీయ, వరంగల్ బ్యూరో : ఒకప్పుడు నక్సలిజం పోలీసింగ్‌కు అతిపెద్ద సవాలుగా ఉండేదని, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు ప్రమాదాలు ప్రధాన సవాళ్లుగా మారాయని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పోలీసింగ్‌లో కీలకంగా మారినప్పటికీ, మౌలిక పోలీసింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించాలని, దర్యాప్తులు, కోర్టు కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎన్ఐటీలో పోలీసింగ్ పనితీరుపై డీజీపీ సమీక్ష నిర్వహించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీ–స్పార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల ధోరణులు, దర్యాప్తు విధానాలు, నూతన సాంకేతిక వ్యవస్థలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు.

### సైబర్ మోసాలతో రూ.1,700 కోట్ల నష్టం

గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు నష్టపోయారని డీజీపీ తెలిపారు. మోసానికి గురైన వెంటనే ఫిర్యాదు చేయకపోవడం వల్ల నగదు రికవరీ అవకాశాలు తగ్గుతున్నాయని చెప్పారు. అధిక లాభాల పేరుతో జరిగే పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలోనే తొలి స్థానం లభించిందన్నారు. డీసీపీలు, ఏసీపీలు, డీఎస్పీలు క్షేత్రస్థాయిలో ఎక్కువ సమయం గడుపుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సాంకేతికత పోలీసింగ్‌కు తోడ్పాటు మాత్రమేనని, మౌలిక పోలీసింగ్‌కు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. చాక్లెట్ల రూపంలో చిన్నారులను మాదకద్రవ్యాలకు అలవాటు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఆందోళనకరంగా ఉన్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ నివారణలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

### 20 శాతం పోస్టులు ఖాళీ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 50 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. 3,758 మంజూరైన పోస్టులకు 2,976 మంది మాత్రమే విధుల్లో ఉండగా, 782 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. సుమారు 20 శాతం సిబ్బంది కొరత ఉందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో నేరాల నమోదు సుమారు 10 శాతం పెరిగినట్లు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి రైళ్లలో వరంగల్, కాజీపేట ప్రాంతాలకు వచ్చి చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడి తిరిగి వెళ్లే అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. ఎన్ఏటిజిఆర్ఐడీ సహకారంతో సమాచార మార్పిడి, నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్‌లో దోపిడీ కేసులు 7 నుంచి 18కు, తాజాగా 29కు పెరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. సైబర్ మోసాల కేసులు 25 నుంచి 59కు పెరగగా, 2026 జనవరి నుంచి జూలై వరకు 119 కేసులు నమోదయ్యాయి. ఉద్యోగాల పేరుతో మోసాలకు సంబంధించి 40 కేసులు, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి 117 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చేపట్టిన నేను సైతం కార్యక్రమాన్ని డీజీపీ అభినందించారు. నల్లబెల్లి, పర్వతగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన చర్యలను ప్రశంసించారు. సమీక్షలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. డీజీపీ తన ఐపీఎస్ ఉద్యోగ జీవితం వరంగల్‌లో జిల్లా శిక్షణతో ప్రారంభమైందని, నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో ల్యాండ్ మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వహించిన రోజులను గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతలు పోలీసు అమరుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు.

## మద్యం దుకాణాలపై నిఘా ఏది?

**అధిక ధరల వసూళ్లపై చర్యలెక్కడ?**

**గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాలపై దాడులేవీ..?**

**వాహనాల ద్వారా తరలింపుపై తనిఖీలెక్కడ?**

**ఎక్సైజ్ శాఖ పనితీరుపై అన్నీ ప్రశ్నలే.. సమాధానాలు కరువు..!**

**తనిఖీల లెక్కలు బయటపెట్టాలంటున్న ప్రజలు**



కాకతీయ, కారేపల్లి : కారేపల్లి మండలంలో మద్యం విక్రయాలపై వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులు అబ్కారీ శాఖ పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. మద్యం దుకాణాల్లో నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు, గ్రామీణ ప్రాంతాల్లో అనధికారికంగా విక్రయాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు వినిపిస్తున్నా.. అధికారులు చేపడుతున్న తనిఖీలు, చర్యల వివరాలు మాత్రం వెల్లడికావడం లేదు. కొన్ని మద్యం విక్రయ కేంద్రాల్లో సీసాపై ఉన్న గరిష్ఠ చిల్లర ధర కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారా, ఉల్లంఘనలు గుర్తించారా, గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఫిర్యాదులు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవాస్తవమైతే ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

### బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక నిఘా అవసరం

గ్రామీణ ప్రాంతాలకు వాహనాల ద్వారా మద్యం తరలిస్తున్నారన్న ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్ని వాహనాలను తనిఖీ చేశారు, ఎన్ని కేసులు నమోదు చేశారు, అనధికారిక విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అబ్కారీ శాఖ వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. గత నెలలో నిర్వహించిన తనిఖీలు, నమోదైన కేసులు, విధించిన జరిమానాల వివరాలను బహిరంగపరచాలని కోరుతున్నారు. ప్రజా ఫిర్యాదులపై అధికారులు మౌనం వీడి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎంఆర్‌పీ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## నవాబుపేటలో ఘనంగా పోచమ్మ బోనాలు



కాకతీయ, చిగురుమామిడి: చిగురుమామిడి మండలం నవాబుపేటలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, బైండ్ల నృత్యాల మధ్య పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డి సంఘం సభ్యులు ఐక్యమత్యంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సంధి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి కాంతాల అజేందర్‌రెడ్డితో పాటు పలువురు సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మోదీ విధానాలతో దేశం అప్పుల ఊబిలోకి



**కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం**

**ధరల భారంతో సామాన్యుల జీవనం అతలాకుతలం**

**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గాడితప్పకుండా చూడాలి**

కాకతీయ, చిగురుమామిడి : దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, కార్పొరేట్, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి విమర్శించారు. బీజేపీ పాలనకు రానున్న రోజుల్లో చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండల కేంద్రంతో పాటు రేకొండ, పీచుపల్లి, ముల్కనూర్, సీతారాంపూర్, లంబాడిపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ఓగులాపూర్, ముదిమాణిక్యం, రామంచ గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా ఆదివారం కొనసాగింది. మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగానే దేశం అప్పుల ఊబిలోకి కూరుకుపోతోందన్నారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ సామాన్యులపై కేంద్రం పెనుభారం మోపుతోందని ఆరోపించారు. ధరల పెరుగుదలతో ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తోందని తెలిపారు.

### రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్తగా సాగాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గాడితప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకోవాలని చాడ వెంకటరెడ్డి సూచించారు. ధరల పెరుగుదల, ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. సెప్టెంబరు 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ జాగీరీ సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జాతా కోఆర్డినేటర్లు గూడెం లక్ష్మీ, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, బోయిని వల్లభాయ్ పటేల్, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, తేరాల సత్యనారాయణ, ముద్రకోల రాజయ్య, మావురపు రాజు, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బామండ్లపెల్లి యుగేందర్, నర్రావుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడిపై దాడి.. ఇద్దరిపై కేసు

కాకతీయ, చిగురుమామిడి: చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కాశవేణి రాకేష్‌పై దాడి, బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై జేరిపోతుల వెంకటస్వామి, నర్సింగోజు విజయ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 7న ఉదయం రాకేష్ ఇంట్లోకి వెంకటస్వామి అక్రమంగా ప్రవేశించి దూషిస్తూ ఛాతిపై కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయ్ కూడా సహకరించినట్లు ఆరోపించారు. గ్రామ వాట్సాప్ గ్రూపులో అవమానకర వ్యాఖ్యలు, బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. రాకేష్ ఫిర్యాదుతో నేరం నంబర్ 148/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 329(4), 115(2), 292, 351(2), 3(5), దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 92(బి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనకు ప్రాణహాని ఉందని రాకేష్ పోలీసులను ఆశ్రయించారు.

## ప్రజలపై అమ్మవారి కరుణ ఉండాలి

**సింహవాహిని మహంకాళికి మంత్రి సురేఖ ప్రత్యేక పూజలు**

**అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి**



కాకతీయ, హైదరాబాద్: ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీమతి కొండా సురేఖ పట్టు వస్త్రాలు సమర్పించారు. సహచర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గౌడ్, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు శ్రీ అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ మరింత అభివృద్ధి, సుభిక్షాలతో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## వాగులో చిక్కుకున్న కారు

**గ్రామస్తుల సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం**



కాకతీయ, ఏన్కూర్; ఏన్కూరు మండలం నాచారం గ్రామంలోని ప్రముఖ శ్రీ అద్భుత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ మార్గంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. ఆలయ మార్గంలోని వాగుపై ప్రస్తుతం కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాకపోకల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరద దాటికి నీటిలో కొట్టుకుపోయి మునిగిపోయింది. అయితే, అక్కడ ప్రయాణికులను అప్రమత్తం చేసే ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో, విషయాన్ని గమనించని కొందరు భక్తులు శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి దర్శనార్థం కారులో వాగు దాటేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వరద ఉధృతికి కారు నీటి మధ్యలో చిక్కుకు పోయింది. అందులో నుండి దిగడానికి ప్రయత్నించి ఒక మహిళ వరద దాటికి కొంతదూరం కొట్టుకుపోయింది. అదృష్టవశాత్తూ ఆమె దరికి చేరడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది.ప్రమాదాన్ని గమనించిన స్థానిక గ్రామస్తులు తక్షణమే స్పందించి, ట్రాక్టర్ సహాయంతో కారుకు బలమైన త్రాళ్లు కట్టి భద్రంగా ఒడ్డుకు లాగారు. స్థానికుల సమయస్ఫూర్తితో పెద్ద ప్రమాదమే తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న వంతెనల వద్ద ప్రత్యామ్నాయ బాటలు ప్రమాదకరంగా మారినప్పుడు తగిన భద్రతా చర్యలు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించడం పట్ల భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే వాగు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రాకపోకలకు సురక్షిత మార్గాన్ని సుగమం చేయాలని కోరుతున్నారు.

## ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఘనంగా ర్యాలీ

**సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ఆకట్టుకున్న ఆదివాసీలు**





కాకతీయ, ఏటూరునాగారం రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీలు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. వై జంక్షన్‌లోని కొమురం భీమ్ జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. సంప్రదాయ దుస్తులు ధరించిన ఆదివాసీలు నృత్యాలు చేస్తూ, వాయిద్యాలు వాయిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించేలా ర్యాలీ కొనసాగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో ప్రధాన రహదారి సందడిగా మారింది. ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశాన్ని ర్యాలీ ద్వారా చాటిచెప్పారు.

## యువతి అదృశ్యం.. కేసు నమోదు




కాకతీయ, గీసుకొండ : గీసుకొండ మండలం హర్జాతండాకు చెందిన బానోతు కీర్తన (18) అదృశ్యమైనట్లు సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. ఈ నెల 3న రాత్రి అమ్మమ్మ బాదావత్ బాలమ్మతో కలిసి నిద్రించిన కీర్తన.. రాత్రి 11.30 గంటలకు ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదృశ్యమైన సమయంలో కీర్తన ఆకుపచ్చ టాప్, ఎరుపు ప్యాంటు ధరించి ఉందని, ఎత్తు సుమారు 5.5 అడుగులు, ఛాయ తెలుపుగా ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

**కీలక క్యాడర్ ఎందుకు సైలెంట్ మరి ?**

**నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై చర్చ**

**క్యాడర్‌ను ఏకతాటిపైకి తేవడంలో ఎమ్మెల్యేకు సవాల్**

**సీఎం సభ కోసం సమన్వయ కమిటీతో ప్రత్యేక సమావేశం**

**బూత్ స్థాయి నుంచి సైనికుల్లా పనిచేయాలని పిలుపు**

# పరకాల కాంగ్రెస్‌లో సవ్యంగానే ఉందా..?





కాకతీయ, పరకాల : పరకాల కాంగ్రెస్‌లో అంతా సవ్యంగానే ఉందా..? నేతలంతా ఒక్కతాటిపై ఉన్నారా..? క్యాడర్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమన్వయం చేసుకుంటున్నారా..? అంటే పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. ఈ నెల 16న పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే స్వయంగా పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించాల్సిన పరిస్థితి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బూత్ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, కమిట్‌మెంట్‌తో కూడిన ఆర్గనైజేషన్‌తో సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునివ్వడం వెనుక పార్టీ అంతర్గత సమన్వయ లోపాలే కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, క్యాడర్‌ను కలుపుకుని వెళ్లడంలో ఎమ్మెల్యే విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## సీఎం సభ వేళ.. సమన్వయంపై దృష్టి

ముఖ్యమంత్రి సభకు భారీగా జనసమీకరణ చేయాల్సిన నేపథ్యంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మండల కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బీఎల్‌ఏలు, సర్పంచులు, గ్రామ పార్టీ కొత్త, పాత అధ్యక్షులు, కాంటెస్టెంట్ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, సీనియర్ నాయకులతో సమీక్ష జరిపారు. సభ ఏర్పాట్లు, ప్రజల తరలింపు, ప్రచారం, బాధ్యతల కేటాయింపుపై దిశానిర్దేశం చేశారు. అయితే ఇంత విస్తృత స్థాయిలో నాయకులను ఒకచోట చేర్చి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాల్సి రావడం పార్టీ కేడర్‌లో సమన్వయం ఏ స్థాయిలో ఉందన్న ప్రశ్నలకు తావిస్తోంది.

## కలుపుకొని వెళ్లడంలో లోపమేనా?

ఎన్నికల సమయంలో ఒక్కటిగా పనిచేసిన పార్టీ శ్రేణుల్లో ప్రస్తుతం విభేదాలు పెరుగుతున్నాయన్న చర్చ ఉంది. గ్రామస్థాయి నాయకులు, సీనియర్ నేతలు, కొత్తగా బాధ్యతలు చేపట్టినవారి మధ్య సమన్వయం కొరవడిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నేతల మధ్య దూరం పెరగడం క్యాడర్‌పై ప్రభావం చూపుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. కొంతమంది నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి ఉందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో నాయకత్వంపై క్యాడర్‌లో అసంతృప్తి పెరుగుతోందన్న వాదన వినిపిస్తోంది.

## 'సైనికుల్లా పనిచేయాలి'.. ఎందుకీ పిలుపు?

సీఎం సభను విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బూత్ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ప్రజలను పెద్దఎత్తున సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కమిట్‌మెంట్‌తో కూడిన బలమైన ఆర్గనైజేషన్‌తో ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తే సభ చారిత్రాత్మక విజయాన్ని సాధిస్తుందని పేర్కొన్నారు. అయితే క్యాడర్ సహజంగానే సమన్వయంతో పనిచేసే పరిస్థితి ఉంటే ఇలాంటి ప్రత్యేక పిలుపు అవసరం ఉండేదా అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. సభ ఒక్కరోజు కార్యక్రమం కాదని.. నియోజకవర్గంలో పార్టీ బలం, నాయకత్వ సమన్వయానికి కూడా ఇది పరీక్షగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పరకాల పట్టణంలో జరగనున్న సీఎం సభను పార్టీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. గ్రామాల నుంచి జనసమీకరణ, రవాణా, ప్రచారం తదితర బాధ్యతలను నాయకులకు అప్పగించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూడా ఎమ్మెల్యే సూచించారు. అయితే సభకు ఎంతమంది జనాన్ని తరలించారన్నదానికంటే.. ఎంతమంది నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేశారు? అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. పార్టీ అంతర్గత విభేదాలను చక్కదిద్ది క్యాడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఎమ్మెల్యే ఎంత వరకు సఫలమవుతారన్నది సభ ఏర్పాట్లతో పాటు భవిష్యత్ రాజకీయాల్లోనూ ప్రభావం చూపనుంది. సీఎం సభను సక్సెస్ చేయడం ఒక ఎత్తయితే.. ఆ పేరుతో బయటపడుతున్న అంతర్గత అసంతృప్తిని చక్కదిద్దడం ఎమ్మెల్యేకు అసలు సవాల్‌గా మారిందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

# కేసీఆర్ పర్యటనలో భద్రతా వైఫల్యమా?

**మల్లంపల్లి క్రాస్ వద్ద వాహనాన్ని చుట్టుముట్టిన కార్యకర్తలు**

**భద్రతా ఏర్పాట్లపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం**



కాకతీయ,ములుగు ప్రతినిధి: వరంగల్ జిల్లా నల్లబెల్లిలో దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనలో ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద భద్రతా లోపం కనిపించిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మల్లంపల్లి–నర్సంపేట క్రాస్ వద్ద కేసీఆర్ వాహనం చేరుకోగానే పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు వాహనం చుట్టూ గుమిగూడారు. కొందరు వాహనం ముందుభాగానికి చేరుకుని చేతులతో కొడుతూ నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కేసీఆర్ వాహనం క్రాస్ వద్దకు చేరుకున్న సమయంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి వచ్చి స్వాగతం పలికేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు వాహనం ముందుభాగానికి చేరుకోవడంతో వాహనం ముందుకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కార్యకర్తలను నియంత్రించేందుకు అక్కడ తగినంత పోలీసు బందోబస్తు కనిపించలేదని ఆరోపిస్తున్నాయి.

## ఇద్దరు కానిస్టేబుళ్లతోనే భద్రతా ఏర్పాట్లు?

మాజీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి జిల్లాలో పర్యటిస్తున్న సమయంలో భద్రతా ఏర్పాట్లపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కేసీఆర్ పర్యటన సందర్భంగా మల్లంపల్లి ప్రాంతంలో కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే భద్రత కోసం నియమించారని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీంతో అభిమానులు, కార్యకర్తలు ఒక్కసారిగా వాహనం వద్దకు చేరుకోవడంతో పరిస్థితి అదుపు తప్పినట్లు పేర్కొంటున్నాయి. ఘటనపై పోలీసు యంత్రాంగం స్పందించాల్సి ఉంది.

# సోషల్ వెల్ఫేర్ విద్యార్థుల సత్తా

- నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ
- పలు విభాగాల్లో బహుమతులు కైవసం
- పోస్టర్ పెయింటింగ్‌లో కే.స్ఫూర్తికి ప్రథమ బహుమతి
- రాష్ట్రస్థాయి పోటీలకు కే.స్ఫూర్తి ఎంపిక



కాకతీయ, హనుమకొండ : నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల్లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు బహుమతులు సాధించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం, యువతలో అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పోస్టర్ పెయింటింగ్, స్లామ్ పొయెట్రీ, గ్రూప్ డాన్స్, స్లోగన్ రైటింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోస్టర్ పెయింటింగ్‌లో బీజెడ్‌సీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని కే.స్ఫూర్తి ప్రథమ బహుమతి సాధించింది. స్లామ్ పొయెట్రీలో బీఏ రెండో సంవత్సరం విద్యార్థిని వి.అంజలి ద్వితీయ బహుమతి, గ్రూప్ డాన్స్‌లో త్రినేత్ర అండ్ గ్రూప్ ద్వితీయ బహుమతి, స్లోగన్ రైటింగ్‌లో ఎంపీఎస్‌ఎస్ మూడో సంవత్సరం విద్యార్థిని బి.దివ్య తృతీయ బహుమతి సాధించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పోస్టర్ పెయింటింగ్‌లో ప్రథమ బహుమతి సాధించిన కే.స్ఫూర్తి ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయిలోనూ రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అధ్యాపకులు ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మానస, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమ, డాక్టర్ శైలజతో పాటు కళాశాల సిబ్బంది విజేతలను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యత, సృజనాత్మకత, కళా రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



కాకతీయ, గీసుగొండ: అకాలంగా మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి అతడి బాల్య స్నేహితులు ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. వరంగల్ మహానగర పాలక సంస్థ 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామానికి చెందిన మంచాల సురేష్ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబానికి బాల్య స్నేహితులు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన సురేష్ సహచర విద్యార్థులంతా కలిసి ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సురేష్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయనతో తమకున్న బాల్య స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదివాసీలే ప్రకృతికి అసలైన రక్షకులు

- అడవులు, సహజ వనరుల పరిరక్షణలో కీలక పాత్ర
- నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీరామానంద్



కాకతీయ, నర్సంపేట టౌన్ : అడవి, ప్రకృతి, మట్టి పరిమళాలను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు కీలక పాత్ర పోషిస్తున్నారని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీరామానంద్ అన్నారు. ప్రకృతిని తల్లిగా భావించి తరతరాలుగా అడవులు, కొండలు, నదులు, సహజ వనరులను సంరక్షిస్తున్న ఆదివాసీలు ప్రకృతికి అసలైన రక్షకులని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా నర్సంపేటలో నిర్వహించిన ర్యాలీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, జీవన విధానం దేశానికి అమూల్యమైన వారసత్వమని అన్నారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రకృతిని కాపాడుతున్న ఆదివాసీ సోదర, సోదరీమణులకు ప్రపంచ ఆదివాసుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వారి అభ్యున్నతికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాటా ప్రభాకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ములకల మనీష్, కాంగ్రెస్ యువ నాయకులు మెరుగు కిరణ్, గోక వేదప్రకాష్, షాలుమ్, కాటా అఖిల్, చీకటి శివమణి, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న ఆసుపత్రుల పరిరక్షణే ప్రజారోగ్య రక్షణ

- ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- నకిలీ వైద్యులపై ఉక్కుపాదం.. వైద్యులకు చట్టపరమైన రక్షణ
- వైద్య రంగ సమస్యలపై థానాకాన్–2026లో అసోసియేషన్ నేతల విస్తృత చర్చ
- థానా రాష్ట్ర అధ్యక్షుడిగా డా. పి. ప్రవీణ్ ప్రమాణ స్వీకారం




బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ప్రవీణ్




కాకతీయ, హన్మకొండ : చిన్న, మధ్యతరహా ఆసుపత్రుల మనుగడను కాపాడటంతోపాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (టీహెచ్ ఎఎన్ ఏ) (తానా) మహాసభ డిమాండ్ చేసింది. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రులకు పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ, పాత ఉద్యోగుల ఆరోగ్య పథకం బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరింది. నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వైద్యులు, వైద్య సిబ్బందికి బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది. వరంగల్ అరేపల్లిలోని వజ్రా గార్డెన్స్‌లో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 11వ వార్షిక రాష్ట్ర మహాసభ థానాకాన్–2026 ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు, చిన్న, మధ్యతరహా, పెద్ద ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాద భద్రత, ఐసీయూ ప్రొటోకాల్స్, రోగుల భద్రత, వైద్య నైతిక విలువలు, ఆరోగ్య బీమా, ఆసుపత్రుల ఆర్థిక నిర్వహణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, డిజిటల్ హెల్త్‌కేర్, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం తదితర అంశాలపై శాస్త్రీయ చర్చలు, నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రభుత్వానికి పలు సూచనలు

థానాకాన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్యానల్ చర్చలో చిన్న, మధ్యతరహా ఆసుపత్రుల సమస్యలు, పెరుగుతున్న నియంత్రణ నిబంధనలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, బీమా, వైద్యుల భద్రత, నకిలీ వైద్యం, వైద్య విద్య తదితర అంశాలపై చర్చించారు. ఐఎంఏ, థానా, తాన్హా, హెచ్‌ఆర్‌డీఏ ప్రతినిధులతో రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య సంరక్షణ కమిషన్, సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలో అవసరమైన సవరణలు చేసి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో థానాకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అగ్ని ప్రమాద భద్రత, మురుగు నీటి శుద్ధి, కాలుష్య నియంత్రణ నిబంధనలను ఆసుపత్రి పరిమాణం, అందించే వైద్య సేవలు, ప్రమాద స్థాయికి అనుగుణంగా ఆచరణాత్మకంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రుల వర్గీకరణలో పడకల సంఖ్యకే కాకుండా వైద్య సేవల నాణ్యత, సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది అర్హతలు, రోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## బకాయిలు చెల్లించాలి

ఆరోగ్యశ్రీ, పాత ఉద్యోగుల ఆరోగ్య పథకం బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటంతో చిన్న, మధ్యతరహా ఆసుపత్రుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతోందని మహాసభ పేర్కొంది. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరింది. ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో ప్రైవేట్ ఆసుపత్రులను ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంలో భాగస్వామ్యం చేయాలని సూచించింది. వైద్య వృత్తి నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఆరోగ్య విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేయాలని కోరింది. నకిలీ వైద్యులపై నిరంతర పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, అర్హత లేని వ్యక్తులు వైద్య సేవలు అందించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనరేట్, పోలీస్ శాఖ, పోలీస్ స్టేషన్ల స్థాయిలో తక్షణ స్పందన వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరింది. మారుమూల ప్రాంతాల్లో ఆసుపత్రులు ఏర్పాటు చేసే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేసింది.

## డా. పి. ప్రవీణ్ ప్రమాణ స్వీకారం

ఈ సందర్భంగా థానా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా డా. పి. ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేశారు. చిన్న, మధ్యతరహా ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, ఆసుపత్రుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. చిన్న, మధ్యతరహా ఆసుపత్రుల సమస్యలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. డా. పి. ప్రవీణ్ థానా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం వరంగల్ జిల్లాకు గర్వకారణమని నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డా. పి. ప్రవీణ్, కో–చైర్మన్ డా. ముక్కా దిలీప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ఎల్. నాగేశ్వర్ రావు, ట్రెజరర్ డా. వి. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. డా. పి. కాళీ ప్రసాదరావు, డా. టి. నర్సింగ రెడ్డి, డా. కె. అశోక్ రెడ్డి, డా. వి. రాకేష్, డా. నరసింహారావు, డా. పి. విజయ చంద్ర రెడ్డి, డా. కస్తూరి ప్రమీల, డా. ఎం. శేషు మాధవ్, డా. విద్యాసాగర్, డా. దశరథం, డా. జి. రమేష్, డా. ఎం. సుదీప్, డా. పి. సుధీర్ కుమార్, డా. కొత్తగట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.టీహెచ్ ఎఎన్ ఏ (తానా) రాష్ట్ర అధ్యక్షులు డా. అరుణ్ కటారి, ప్రధాన కార్యదర్శి డా. ఎం.వి. ప్రసాద్, కోశాధికారి డా. కె. అశోక్ కుమార్, తక్షణ పూర్వ అధ్యక్షులు డా. ఎల్. సురేష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ డా. ఎస్. నౌనిహాల్ సింగ్, ఉపాధ్యక్షులు డా. వి. అశోక్, డా. ఎన్. మహేష్ బాబు, డా. గుండేటి రమేష్ తదితరులు హాజరయ్యారు.

# మోదీ మోదీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రశ్నించాలి





**యువత హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తాం**
**నిరుద్యోగం, విద్య, సామాజిక న్యాయంపై ఉద్యమాలు**
**ప్రశ్నించడం, నిరసించడం యువత ప్రజాస్వామ్య హక్కులు**
**యువతను అణచివేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు**
**ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేయాలి**
**యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్**

కాకతీయ, ఖమ్మం టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ పిలుపునిచ్చారు. యువత శక్తిని జాతీయ నిర్మాణానికి వినియోగించడంతో పాటు నిరుద్యోగం, విద్య, సామాజిక న్యాయం, యువత హక్కులపై అవగాహన కల్పించడం యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఖమ్మం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు.

### యువత గొంతును అణచలేరు

ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదని, ప్రశ్నించడం, నిరసించడం, న్యాయం కోరడం యువతకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులని సాయికుమార్ అన్నారు. దేశ యువత గొంతుకను అణచివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. హింస, బెదిరింపులు, అణచివేతతో యువత హక్కులను కాలరాయడం సాధ్యం కాదన్నారు. నిరుద్యోగం నిర్మూలన, విద్యారంగ అభివృద్ధి, సామాజిక న్యాయం, యువత హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. బీజేపీ ముసుగులో ఉన్న ఆర్ఎస్ఎస్ భావజాలానికి యువత భయపడదని, నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటుందని అన్నారు. యువతను భయపెట్టలేరని, అణచలేరని స్పష్టం చేశారు.

### ప్రజలకు అన్నదానం

జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో సాయికుమార్ ఆధ్వర్యంలో సుమారు 300 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్త సీతారాములు, శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా జనరల్ సెక్రటరీలు కిల్లర్ అనిల్, గంగరాజు, బచ్చలకూర నాగరాజు, గాదెల ఝాన్సీ, బామ్మిడి శ్రీనివాస్, రంగా జనార్ధన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు షాహెల జావిద్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ అంజన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెజ్జం బాలగంగాధర్, బానోత్ కోటేష్, జిల్లా జనరల్ సెక్రటరీలు బెల్లంకొండ శరత్, కుక్కల మహేష్, అన్వేష్ గౌడ్, నెల్లూరి ఉపేందర్, బాలరాజ్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బెల్లం సాయి తేజ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు అంబటి ఈశ్వర్, జంగం రాజేష్, నితీష్ కుమార్, కైసర్, ఆకాష్ నాయుడు, సాయి తేజ, ఖమ్మం టౌన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, టౌన్ ఉపాధ్యక్షులు సైదన్ రావు, సంపత్ నాయుడు, మండల అధ్యక్షులు రామకృష్ణ, నిమ్మల నాగేశ్వరావు, సతీష్, ముత్తారావు, యువజన కాంగ్రెస్ నాయకులు బోడిపూడి రాజా, పంది రాజు, దేవరకొండ రాజీవ్ గాంధీ, సాయి కుమార్, తోట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగురాళ్లబోడు–సాయనపేటకు

# రోడ్డు ఎప్పుడేస్తారు?

- రెండు గ్రామాల మధ్య ఉన్న దారికి వర్షాకాలంలో నరకయాతన
- నాయకులు వస్తున్నారు.. పోతున్నారు.. సమస్య మాత్రం తీరడం లేదు
- :మండిపడుతున్న రెండు గ్రామాల ప్రజలు



కాకతీయ, కారేపల్లి : రంగురాళ్లబోడు–సాయనపేట రహదారి సమస్య ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్నా పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే ఈ రహదారి బురదమయంగా మారి, గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి దుస్థితిపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఇప్పటికే తెలిపారని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఇప్పటికీ రహదారి పనులు ప్రారంభం కాలేదని చెబుతున్నారు. రోడ్డు శాంక్షన్ అయిందని చెబుతున్నా తమ కష్టాలు మాత్రం తీరడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు గ్రామాలకు వచ్చి హామీలు ఇచ్చి వెళ్లిపోతున్నారని, ఎన్నికలు ముగిసిన తర్వాత రహదారి సమస్యను పట్టించుకునే వారు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ రహదారి బురదమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి కాంట్రాక్టర్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి పనులు వెంటనే ప్రారంభించి, వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని రంగురాళ్లబోడు–సాయనపేట గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మహేష్‌బాబు పుట్టినరోజున సేవా నిరతి

**అభిమానం అంటే ఆపదలో అండగా నిలవడమే**
**: దేవభక్తుని కిషోర్‌బాబు**



కాకతీయ, ఖమ్మం బ్యూరో : సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా అభిమాన సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్‌బాబు నేతృత్వంలో పేదలు, నిరాశ్రయులకు అన్నదానం, ప్రభుత్వాసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా భోజనం అందించారు. ఖమ్మం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జిల్లా, నగర కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ అభిమానం అంటే కేవలం సంబరాలు చేసుకోవడం కాదని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన అభిమానమన్నారు. కార్యక్రమంలో తోట రంగారావు, మునగాల బాలు, బాణాల లక్ష్మణ్, పులిపాటి సంపత్‌కుమార్, చింతమల్ల గురుమూర్తి, నల్లబెల్లి గౌతమ్, సుధాకర్, ఏనుగు మహేష్, బుర్రి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం చేయాలి**
**పేరుపల్లిలో ఘనంగా వేడుకలు**



కాకతీయ, కారేపల్లి: 'ప్రపంచ ఆదివాసులారా.. ఐక్యం కండి.. హక్కుల పరిరక్షణకు కదం తొక్కండి' అనే నినాదంతో కారేపల్లి మండలం పేరుపల్లిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏహెచ్‌పీఎస్, ఏఐటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం జెండాను ఆవిష్కరించి, ఆదివాసీ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు అలెం గురవయ్య, ధనసరి శ్రీను, యదలపల్లి శ్రీను, అలెం బాలరాజు మాట్లాడుతూ.. జల్–జంగల్–జమీన్ హక్కుల కోసం కొమురం భీమ్, బిర్సా ముండా, సమ్మక్క–సారక్క, అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాలు ఆదివాసీలకు స్ఫూర్తిదాయకమన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా, రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూళ్ల హక్కుల పరిరక్షణకు ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకన్న, కోటయ్య, నాగేశ్వరరావు, సంపత్, సుగుణ, మంగమ్మ, స్వరూప, సావిత్రి, కోటమ్మ, నిరోషతో పాటు పెద్ద సంఖ్యలో ఆదివాసీలు పాల్గొన్నారు.

## వరద నీటికి నాచారం రహదారి ధ్వంసం

**ఫోర్ వీలర్ల రాకపోకలు నిలిపివేత.. పోలీసుల హెచ్చరిక**



కాకతీయ, ఏన్కూర్: భారీ వర్షాలతో వరద ఉద్ధృతి పెరగడంతో ఏన్కూర్ మండలంలోని నాచారం టెంపుల్‌కు వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి సమీపంలో దెబ్బతింది. వరద ప్రవాహానికి రహదారిలో కొంత భాగం కొట్టుకుపోయి గండ్లు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ఫోర్ వీలర్ల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. భక్తులు, వాహనదారులు ప్రమాదకరంగా రహదారిని దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. రహదారి పునరుద్ధరణ పూర్తయ్యే వరకు నాచారం ఆలయానికి వెళ్లే భక్తులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు.

# పోడు సాగుదారులపై దాడులను ప్రతిఘటించాలి

- ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకుంటాం
- గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడంలో పాలకుల వైఫల్యం
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను సమిష్టిగా అడ్డుకుందాం
- గుండాల ప్రాంతంలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



కాకతీయ, గుండాల : గుండాల ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతర పోడు సాగుదారులు సాగు చేసుకుంటున్న భూములకు తక్షణమే హక్కులు కల్పించాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. పోడు సాగుదారులపై అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల దాడులు, దౌర్జన్యాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా గుండాల మండలంలో కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా భూములను నమ్ముకుని జీవిస్తున్న పోడు సాగుదారులపై అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సాబీర్ పాషా ఆరోపించారు. సాగుభూములను లాక్కోవడం అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చడమేనన్నారు. తక్షణమే సాగుదారులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు

గ్రామీణ పేదలకు ఆధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని దశలవారీగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. మారుమూల గ్రామాలకు కనీస రోడ్లు, మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని సాబీర్ పాషా ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. గుండాల ప్రాంతంలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బద్లావ్ జరూరీ హై నినాదంతో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమురం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహిద్ అధ్యక్షతన యాత్ర జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, ఏఐటీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, సీపీఐ కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్, బచ్చల రామయ్య, లక్ష్మయ్య, సమ్మయ్య, సమీర్, సంధ్యారాణి, నాగమణి, ఎర్రమ్మ, అప్రోచ్, నాసిర్, షబ్బీర్, పవన్ కళ్యాణ్, రవి వర్మ, వంశీ, వరుణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లి కాంగ్రెస్‌లో క'లహం'..!

- డీసీసీ అధ్యక్షుడి సమక్షంలోనే ఇరువర్గాల ఘర్షణ
- పార్టీ కార్యాలయంలో ఉద్రిక్తత.. మాజీ ఎంపీటీసీపై దాడి ఆరోపణ
- చేరికలతో పెరిగిన పాత, కొత్త నేతల ఆధిపత్య పోరు
- వర్గాలను ప్రోత్సహిస్తున్న నేతలపై చర్యలు తీసుకోవాలి : గింజల నర్సింహారెడ్డి



కాకతీయ, కారేపల్లి/కామేపల్లి : కామేపల్లి కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు బహిర్గతమైంది. పార్టీలో పాత, కొత్త నాయకుల మధ్య కొంతకాలంగా సాగుతున్న విభేదాలు డీసీసీ అధ్యక్షుడి సమక్షంలోనే ఘర్షణకు దారితీశాయి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనే ఇరువర్గాలు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్యపై మరో వర్గానికి చెందిన వారు దాడి చేశారంటూ ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది. ఇటీవల బీఆర్ఎస్, టీడీపీ తదితర పార్టీల నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో పాత, కొత్త నేతల మధ్య ఆధిపత్య పోరు మరింత ముదిరిందనే చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు తామే తీసుకొచ్చామని రెండు వర్గాలు పరస్పరం క్రెడిట్ కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజకీయ విభేదాలు క్రమంగా బహిరంగ వివాదాలుగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### కమిటీల ఏర్పాటులోనూ పోటీ

పార్టీ పదవుల ఎంపికలోనూ వర్గపోరు ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామ కమిటీల ఏర్పాటు విషయంలో సాతానిగూడెం, కొత్తలింగాల గ్రామాల్లో రెండు వర్గాలు చెరో కమిటీ ఏర్పాటు చేసుకోవడంతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ఒకే పార్టీకి రెండు కమిటీలు ఎలా ఉంటాయంటూ పలువురు కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. సంస్థాగత నిర్మాణం బలోపేతం చేయాల్సిన సమయంలోనే కమిటీల విషయంలో వివాదాలు తలెత్తడం పార్టీ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారింది. పార్టీలో వర్గాలను ప్రోత్సహిస్తున్నారంటూ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, పుచ్చకాయల వీరభద్రం, పతే అహ్మద్‌పై డీసీసీ జిల్లా కార్యదర్శి గింజల నర్సింహారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ఆధిపత్యానికి ప్రాధాన్యం ఇస్తున్న వారిని వెంటనే పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంతర్గత విభేదాలకు కారణమవుతున్న నాయకులపై డీసీసీ, పీసీసీ అధ్యక్షులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని, వర్గపోరుతో కార్యకర్తల్లో అయోమయం సృష్టించడం సరికాదని నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

మాంట్‌ఫోర్ట్ పూర్వ విద్యార్థుల

# ఆత్మీయ సమ్మేళనం

**27 ఏళ్ల తర్వాత కలుసుకున్న 1998–99 బ్యాచ్ విద్యార్థులు**
**నాటి గురువులకు ఘన సన్మానం**



కాకతీయ, ఖమ్మం: ఖమ్మం గుట్టలబజార్ మాంట్‌ఫోర్ట్ హైస్కూల్‌లో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 27 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్న విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. నాటి ప్రధానోపాధ్యాయులు బ్రదర్ జార్జిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూర్వ విద్యార్థులను అభినందించారు. తాము అందించిన విద్య, క్రమశిక్షణకు విద్యార్థుల విజయాలే నిజమైన గుర్తింపన్నారు. నాటి ఉపాధ్యాయులు కలీలుద్దీన్, రమణ, రాజేంద్రప్రసాద్, మల్లయ్య, నరసింహారావు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పాఠశాలను, గురువులను గుర్తుచేసుకుని సన్మానించడం అభినందనీయమన్నారు. సమ్మేళనంలో వినయ్‌కుమార్, కిరణ్, వినీత్, చంద్రశేఖర్, మనోహర్, మాతంగి అనిల్‌కుమార్, నాగరాజు, పాపారావు, గణేష్, జి. వెంకటేశ్వర్లు, రవి, విజయ్‌రాజు, నాగేశ్వరరావు, శేఖర్, గురవయ్య, రామారావు, భానుప్రసాద్, రాజేష్, ఖాదర్‌బాబు, కుక్కల క్రాంతి, బసవయ్య, విక్రమ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో ఎదగాలి.. ఐక్యతతో బలపడాలి

- విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో బైండ్ల సమాజం ముందుకు సాగాలి
- పిల్లల చదువును మధ్యలో ఆపొద్దు.. ఉన్నత విద్యతో భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి
- బైండ్ల భవన్‌కు రూ.2 కోట్ల నిధులు ఇవ్వాలని సీఎంను కోరాం
- 'పే బ్యాక్ టు సొసైటీ' స్ఫూర్తితో సేవ చేయాలి
- బీఈఏటీని బలోపేతం చేసి రాష్ట్రవ్యాప్తంగా సమాజాన్ని ఏకతాటిపైకి తేవాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



కాకతీయ, హైదరాబాద్ : బైండ్ల సమాజం విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు సాగాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువత విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన తెలంగాణ బైండ్ల ఉద్యోగుల సంఘం విజన్ మీట్–2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె ఈ మేరకు మాట్లాడారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తాను పార్లమెంట్ వరకు చేరడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులే కారణమని డా. కడియం కావ్య తెలిపారు. కులవృత్తి ద్వారా ఆదాయం వస్తోందనే కారణంతో పిల్లల చదువును మధ్యలోనే నిలిపివేయవద్దని, ఉన్నత విద్య, వృత్తి విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని కోరారు. ఆడపిల్లల చదువుకు తల్లిదండ్రులు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పిల్లలను ఉన్నతంగా చదివించి జీవితంలో స్థిరపడేలా సహకరించాలన్నారు.

### బైండ్ల భవన్‌కు రూ.2 కోట్ల నిధులు

బైండ్ల భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాను, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి కోరినట్లు ఎంపీ తెలిపారు. తొలి విడతగా సుమారు రూ.2 కోట్ల నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని, త్వరలోనే దీనిపై ప్రభుత్వం నుంచి జీవో వచ్చే అవకాశం ఉందని చెప్పారు. బీఈఏటీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బైండ్ల ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువతను సంఘంలో భాగస్వాములను చేయాలని డా. కడియం కావ్య కోరారు. గ్రూపులు, విభేదాలకు తావు లేకుండా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా సంఘం కార్యకలాపాలను విస్తృతంగా ప్రచారం చేసి సభ్యత్వాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ 'పే బ్యాక్ టు సొసైటీ' స్ఫూర్తిని అలవర్చుకుని సమాజానికి తిరిగి సేవ చేయాలని అన్నారు. నిజాయితీ, తెలివితేటలు, ప్రజాబలమే తమ పెట్టుబడులని ఎంపీ పేర్కొన్నారు. రాజకీయ హోదాలు ఉన్నా లేకపోయినా సమాజానికి తన సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తూ సమాజంలో పరస్పర అనుబంధాలను పెంచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఈఏటీ అధ్యక్షుడు చినపాక స్వామి, కోశాధికారి డా. జీలకర్ర స్వామి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జీలకర్ర రామ్మూర్తి, ముఖ్య సలహాదారు కడెం ధనుంజయ, సలహాదారులు డా. జీలకర్ర సోమశేఖర్, చినపాక శ్రీనివాస ప్రసాద్, ఏ. ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

# న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాటం



- అజంజాహి మిల్స్ మాజీ ఉద్యోగులకు 200 గజాల స్థలాలు ఇవ్వాలి
- 318 మంది కార్మికులకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఆదేశాలు

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : న్యాయవ్యవస్థపై తమకు అపారమైన విశ్వాసం ఉందని, ఆ నమ్మకంతోనే కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తున్నామని అజంజాహి మిల్స్ వీఆర్‌ఎస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుడికాల కుమారస్వామి, జన్ను రమేష్ అన్నారు. మిల్లు మూసివేత సమయంలో వీఆర్‌ఎస్ తీసుకున్న ఉద్యోగులందరికీ 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని చింతల్ బ్రిడ్జి వద్ద వీఆర్‌ఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతి చెందిన తోటి కార్మికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుడికాల కుమారస్వామి, జన్ను రమేష్ మాట్లాడుతూ అజంజాహి మిల్లు 2002లో మూతపడిన సమయంలో యాజమాన్యం వాలంటరీ రిటైర్మెంట్ స్కీం ప్రకటించడంతో 452 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారని తెలిపారు. వారిలో 134 మందికి ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చారని, మిగిలిన 318 మందికి కూడా అదే విధంగా స్థలాలు ఇవ్వాలని కోరినా నేషనల్ టెక్స్టైల్ కార్పొరేషన్ తిరస్కరించిందన్నారు.

### హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు

దీంతో కార్మికులు హైకోర్టును ఆశ్రయించగా, 2016 మార్చి 18న వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. దీనిపై ఎన్‌టీసీ అప్పీల్‌కు వెళ్లడంతో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశామని, వాదనలు విన్న న్యాయస్థానం 318 మంది రిటైర్డ్ ఉద్యోగులకు కూడా 200 గజాల స్థలాలు ఇవ్వాలని 2021 అక్టోబర్ 26న ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. 2002లో మిల్లు మూసివేయకముందే పదవీ విరమణ పొందిన వీఆర్‌ఎస్ కార్మికులకు కూడా 200 గజాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. 1992 నుంచి 2002 వరకు పీఆర్‌ఎస్ తీసుకున్న కార్మికులకు మిల్లు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాల వల్ల అన్యాయం జరిగిందన్నారు. న్యాయమైన డిమాండ్లకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 150 మంది కార్మికులు దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని, తీవ్ర మనోవేదనతో కొందరు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి పాండవుల సమ్మయ్య, ఈసీ సభ్యులు తౌటం రమేష్, సంజీవ్, సుమారు 50 మంది కార్మికులు పాల్గొన్నారు.

# గూడూరులో ఇళ్ల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు





- మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- మౌలిక వసతులు, సభా ప్రాంగణం, పార్కింగ్‌పై దృష్టి
- హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలన

కాకతీయ, హనుమకొండ : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యటన సందర్భంగా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సూచించారు. గూడూరు గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం హనుమకొండ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో కలిసి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కమలాపూర్ మండలంలో పర్యటించారు. గూడూరు, కమలాపూర్, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గూడూరు గ్రామంలో మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్న కార్యక్రమ స్థలాన్ని పరిశీలించి, అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు.

### ఏర్పాట్లపై సమీక్ష

లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులు, లబ్ధిదారుల జాబితా, సభా ప్రాంగణం, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభ

- నల్లబెల్లిలో ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా కేటీఆర్, హరీశ్‌రావు
- పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో సభ.. అనంతరం సహపంక్తి భోజనం



కాకతీయ, నల్లబెల్లి : దివంగత మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభను సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ సంస్మరణ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. సభ అనంతరం హాజరైన వారికి సహపంక్తి భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

### భారీగా తరలివచ్చే అవకాశం

కేటీఆర్, హరీశ్‌రావు హాజరవుతున్న నేపథ్యంలో నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు నల్లబెల్లికి చేరుకునే అవకాశం ఉంది. దీంతో సంస్మరణ సభకు సంబంధించిన ఏర్పాట్లలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యాయి. సభకు హాజరయ్యే కార్యకర్తలు, అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ నల్లబెల్లి పర్యటన సందర్భంగా భారీగా కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో ట్రాఫిక్, భద్రత పరంగా ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో రేపటి కార్యక్రమానికి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# కేంద్ర నిధులతోనే నగర అభివృద్ధి




- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా తేలేదు
- కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలి
- కేంద్ర పథకాలతోనే కీలక అభివృద్ధి పనులు
- కరీంనగర్‌కు ప్రత్యేకంగా రూ.1,000 కోట్ల ప్యాకేజీ తేవాలి
- ఆర్వోబీ పనులు ముందుకు సాగకపోవడంపై ప్రశ్నలు
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

కాకతీయ, కరీంనగర్ : కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులే ప్రధాన ఆధారమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నగర అభివృద్ధి కోసం ఒక్క భారీ పథకాన్ని కూడా తీసుకురాలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కేంద్ర పథకాల ద్వారా వస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఘనతగా కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం మానుకోవాలని సూచించారు. కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు నగర అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక్క భారీ పథకాన్ని తీసుకురాలేదని ఆరోపించారు. కేంద్ర నిధులతో జరుగుతున్న పనులను రాష్ట్ర ప్రభుత్వ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

### కేంద్ర పథకాలతోనే కీలక పనులు

కరీంనగర్‌లో చేపట్టిన స్మార్ట్‌సిటీ, అమృత్–1, అమృత్–2, యూఐడీఎఫ్, యూసీఎఫ్, సీఆర్‌ఎఫ్ తదితర పథకాలు కేంద్ర ప్రభుత్వ చొరవతోనే వచ్చాయని సునీల్‌రావు తెలిపారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెరో 50 శాతం వాటా ఉందని, మొత్తం 46 పనుల్లో 41 పూర్తయ్యాయని చెప్పారు. అమృత్ పథకం రెండు విడతల్లో రూ. 274 కోట్లు, మూడో విడతలో మరో రూ.80 కోట్లు కరీంనగర్‌కు వచ్చినట్లు వివరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ. 840 కోట్ల నిధులు సమకూరే అవకాశం ఏర్పడిందన్నారు.

### రూ.1,000 కోట్ల ప్యాకేజీ తేవాలి

నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కనీసం రూ.1,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ తీసుకురావాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. రూ.1,000–2,000 కోట్ల ప్రత్యేక నిధులు తీసుకొస్తే కాంగ్రెస్ నేతలకు పౌర సన్మానం చేస్తామని ప్రకటించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి విషయంలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని, అయితే నిధులు తెచ్చింది ఎవరు, టెండర్లు పిలిచింది ఎవరు, ఇప్పటివరకు భూసేకరణ ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. సేతుబంధన్ కింద కేంద్రం రూ.156 కోట్లు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం పనులను ముందుకు తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు లేని ఒక్క పథకాన్నైనా కాంగ్రెస్ నేతలు చూపించాలని సునీల్‌రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏ పథకం ద్వారా నిధులు తీసుకొచ్చిందో ప్రజలకు వివరించాలని కోరారు. బండి సంజయ్‌కుమార్ చొరవతోనే కరీంనగర్‌ను యూసీఎఫ్ పథకంలోకి తీసుకురావడం సాధ్యమైందని, కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీతో హడ్కో ద్వారా రాష్ట్రానికి నిధులు సమకూరే అవకాశం ఏర్పడిందని తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే గొర్రె సిద్దయ్య కన్నుమూత

- 1978లో 7,056 ఓట్ల మెజారిటీతో ఘన విజయం
- 95 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లో తుదిశ్వాస

కాకతీయ, చేర్యాల : పూర్వపు చేర్యాల నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గొర్రె సిద్దయ్య (95) కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్తతో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, చేర్యాల ప్రాంత ప్రజల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన గొర్రె సిద్దయ్య 1978 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి చేర్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ (ఐ) అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు 18,547 ఓట్లు రాగా, ప్రత్యర్థి నిమ్మ రాజారెడ్డికి 11,491 ఓట్లు వచ్చాయి. దీంతో 7,056 ఓట్ల మెజారిటీతో సిద్దయ్య విజయం సాధించారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

### 1983లోనూ పోటీ

1978 విజయంతో రాజకీయంగా తనదైన ముద్ర వేసిన సిద్దయ్య 1983 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ తరపున బరిలోకి దిగారు. అయితే ఆ ఎన్నికల్లో నిమ్మ రాజారెడ్డి విజయం సాధించగా, సిద్దయ్య 20,155 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. 1961లో ఏర్పడిన చేర్యాల అసెంబ్లీ నియోజకవర్గం 2008లో రద్దయింది. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యేగా సిద్దయ్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సిద్దయ్య భార్య గొర్రె శాంతమ్మ సుమారు మూడు సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఆయనకు కుమారుడు గొర్రె భాస్కర్ ఉన్నారు. భాస్కర్ హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. సిద్దయ్యమృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

### పార్థివదేహానికి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాళి



సిద్దయ్య మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిద్దయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి, చేర్యాల ప్రాంత ప్రజలకు తీరని లోటని పలువురునాయకులుపేర్కొన్నారు. ఆయనరాజకీయ సేవలను, ప్రజలకోసం చేసినకృషిని స్మరించుకున్నారు.

# గంజాయికి యువత దూరంగా ఉండాలి

**: రుద్రంగి ఎస్సై మోతిరాం నాయక్**

కాకతీయ, రుద్రంగి : గంజాయి, మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని రుద్రంగి ఎస్సై మోతిరాం నాయక్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విక్రయాలు, వినియోగానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలను నిలిపే సమయంలో తాళం, హ్యాండిల్ లాక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. తాళం చెవులను వాహనాల్లోనే వదిలేయడం వల్ల చోరీలకు అవకాశం ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# జెండా పండుగకు జనం కదలాలి!

**బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు**

కాకతీయ, చేర్యాల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న చేర్యాల మండల కేంద్రంలో నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా–తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్ పిలుపునిచ్చారు. శ్రీ వింధ్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాత్ర సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథి బల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266